
అనగనగా ఓ మంచి కథ

# అక్రమ సంబంధం

## - సి. ఆనందారామం

( ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, నవంబర్ 10 , 1982 )




**బస్ స్టాప్ దగ్గర నిలబడి ఉంది సుమరాణి.** స్కూటర్ ఆగింది ఆమె ముందు. అలవాటుగా ఆమె ఎక్కబోతోంటే, అతడే దిగాడు. ఆగి ముఖంలోకి చూసింది, 'ఏమిటీ?' అన్నట్లు.

"ఇవాళ మనం మా ఇంటికి వెళ్దాం."

"నేను రానని చాలాసార్లు చెప్పాను. ఇప్పుడూ అదే చెపుతున్నాను."

“మనని గురించి నలుగురూ ఏమనుకుంటున్నారో తెలుసా?"

"తెలీదు. ఎందుకూ తెలుసుకోవడం?"

"ఛీ!ఛీ! నాకు తలకొట్టేసినట్టుగా ఉంది."

"అదేమిటీ? ఇలాంటి విషయాల్లో మొగవాళ్ళు మరింత గర్వంగా తలెత్తుకు తిరుగుతారే."

"అది వేరే ఆడవాళ్ళ విషయమయితే – భార్య గురించి ఎవరైనా ఏమైనా అంటే మాత్రం ప్రాణం పోయినట్లుగా ఉంటుంది.."

"ఓ....."

గమ్మత్తుగా దీర్ఘం తీసింది. నవ్వింది.

అప్పుడు తెలుసుకున్నాడు. తను ఎలా నోరు జారింది. నాలుక కరుచుకున్నా లాభం లేదు – సుమకి దొరికిపోయాడు.

"ప్లీజ్! నా మాట విని.."

అతడి మాటలు పూర్తికాకుండానే అడ్డుపడింది. "అయితే ఆటోలో వెళ్ళి పోనా?"

"వద్దులే కూర్చో! మీ ఇంటికే వెళ్దాం."

శ్రీహరి నిజంగానే వెళ్ళిపోతాడేమోనని లోలోపల అదురుతోన్న సుమ చిరునవ్వుతో స్కూటర్ మీద కూర్చుంది.

సుమ అపార్ట్‌మెంట్ ముందు దిగారు ఇద్దరూ.

"మమ్మీ!" బాల్కనీలోంచి చెయ్యి ఊపాడు ప్రభు.

కిందనుంచే తనూ చెయ్యి ఊపి పరుగులాంటి నడకతో మెట్లు ఎక్కి ప్రభుని ఎత్తుకుని ముద్దు పెట్టుకుని తను తెచ్చిన చాక్లెట్ చేతిలో పెట్టింది.

శ్రీహరి కూడా చెయ్యి జాపాడు.

"గుడ్ ఈవినింగ్ అంకుల్" అంటూ షేక్‌హాండ్ ఇచ్చాడు బాబు.

"అంకుల్ కాదు.." చెప్పబోయాడు శ్రీహరి.

"అంకుల్ కాకపోవటం ఏమిటి? అంకులే" తీవ్రంగా అడ్డుపడింది సుమ.

"కూర్చో టీ తెస్తాను."

బాబుని ఎత్తుకుని కిచెన్‌లోకి వెళ్ళింది  ఆయా ఉంది. అయినా ఇప్పటికీ తనకి టీ సుమ స్వయంగా చేసి తెస్తుంది. శ్రీహరి మనసంతా చేదుచేదుగా అయింది.

ఆ రోజు మధ్యాహ్నం స్నేహితుల వేళాకోళాలు ఇంకా మనసును సలుపుతున్నాయి.

"ఏం గురూ! మీ స్నేహితురాలిని మాకు పరిచయం చెయ్యరా?" అన్నాడొకడు.

"భలే లక్కీ ఛాన్స్. దొరుకుతుందేమో చూడరాదా గురూ! స్కాచ్ విస్కీ కొట్టిస్తాను" మరొకడు.

"షటప్" కోపం, చిరాకు, ఆవేదన పట్టలేక పిచ్చిగా అరిచాడు.

"ఎందుకురా అంత కోపం? ఈవిడేమైనా మహా పతివ్రతా? ఇవాళ నీతో వచ్చింది. ఇంతకు ముందు ఎంతమందితో వెళ్ళిందో? ఇకముందు మరెంత మందితో పోతుందో?"

"ఛీ!ఛీ అలా మాట్లాడకండి. ఆవిడ అలాంటిది కాదు."

"నీకెలా తెలుసు? ఇంతా చేసి నెలరోజులనుంచే స్నేహం. నెలరోజుల్లోనే ఇంత దగ్గరిగా వచ్చేసిన మనిషి మంచిదని ఎలా చెప్పగలవు?" నిలదీశాడు, కొంత క్లోజ్ ఫ్రెండ్.

మంచిదని ఎలా తెలుసో, ఎందుకు చెప్పగలడో వివరించలేకపోయాడు శ్రీహరి.

ఆ విషయం చెప్పటానికి సరిపోయిన భాష అతని దగ్గర లేకపోయింది.

ఈ గొడవలన్నీ దేనికి? ఆవిడని మాకు పరిచయం చెయ్యి చాలు. మా తిప్పలు మేం పడతాం."

మనసు రగిలిపోసాగింది శ్రీహరికి. కానీ నోరు విప్పి ఒక్క మాట కూడా అనలేకపోయాడు. ఎలా అనగలడు? ఇంతకంటే దారుణమైన వేళాకోళాలు వాళ్ళతో కలిసి చేశాడు ఇదివరలో. అవన్నీ వేరే ఆడవాళ్ళని ఉద్దేశించి చేసినవి. సుమని ఉద్దేశించి ఒక చిన్న తేలిక మాట కూడా సహించలేదు.

కిచెన్‌లోంచి బాబు నవ్వు, సుమ మాటలూ అస్పష్టంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికీ తనదే తప్పని ఒప్పుకోవటం లేదు మనసు.

ఆ రోజు పెళ్ళి పీటలమీద సుమని సిగ్గుపడుతూ తలవంచుకున్న కూచున్న సుమని, చూసుకుని చూసుకుని ఎంత మురిసిపోయాడు?

తన అదృష్టాన్ని తనకు తనే ఎన్ని విధాలుగా అభినందించుకున్నాడు?

ఆ రోజు –

అందాలన్నీ పోగేసుకున్న సుమ. వాటిని ఆనందంలోకి అనువదించిన రోజు.

ఇంద్రధనస్సులో వర్ణాలకు మాటలొచ్చాయి. అణువణువునా అమృత జలపాతాలు తండవించాయి. ప్రకృతిలో పరిమళాలన్నీ పరవశించి పలకరించాయి...

సుమ మృదువుగా తన జుట్టు రేపుతూ ముందుకు వంగి తడి జుట్టుతో చెంపలమీద గిలిగింతలు పెడుతోంటే కళ్ళు తెరిచాడు.

ఎప్పుడు తెల్లవారింది?

సుమ ఎప్పుడు లేచి, ఎప్పుడు తలారా స్నానం చేసింది?

దగ్గరకు లాక్కోబోయాడు. నవ్వుతూ తప్పించుకుని వంటింటివైపు సైగచేసి ముక్కుమీద వేలు వేసుకుని "లేవండి" అని చెయ్యిపట్టి లేవదీసింది.

సుమరాణి అని పేరెవరు పెట్టారోగాని నిజంగా ఎప్పుడూ నవ్వుతున్న పువ్వులాగే ఉండేది. ఇంట్లో అందరికీ తలలో నాలుకలా మసిలేది. "చదువుకున్న అమ్మాయి మాట వింటుందో, లేదో" అని భయపడ్డ బామ్మ కూడా "ఏమిటో అనుకున్నాను కానీ, చదువుకున్న అమ్మాయిలే మంచివాళ్ళురా! కామాక్షమ్మ ఏరి కోరి చదువూ సంధ్యాలేని పల్లెటూరి గబ్బిలాయిని కోడలిగా తెచ్చుకుంది. అణిగిమణిగి పడి ఉంటుందని. ఆ పిల్ల ఎప్పుడూ ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం. అక్కడి మాటిక్కడా, ఇక్కడి మాటలక్కడా మోసి తంటాలు పెట్టటం.. ఛీ! ఛీ ఆ కొంప నరకమేననుకో. మన సుమ నిజంగా శ్రీ మహాలక్ష్మి" అని మెచ్చేసుకుంది. బామ్మ ప్రశంసలందుకోవడం అంటే మాటలు కాదు. ఎవరినైనా సరే సతాయించటమే తప్ప మెచ్చుకోవటం తెలియని వ్యకి బామ్మ.

ఇలాంటి సుమ. తన పది వరసల చంద్రహారం తాను తెచ్చుకోవటానికి ఎందుకంత గొడవ చేసిందో ఇప్పటికీ అర్థం కాదు అతనికి. పుట్టింటివారిమీద ఎంత మమకారమంటే మాత్రం అంత పెద్ద గొలుసు సమర్పించుకుంటారా?

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

అతడికి ఇష్టమని ప్రత్యేకించి స్ట్రాంగ్‌గా తయారు చేసిన టీ అతడి ముందుంచి అడిగింది. పాత గొడవలు తవ్వుకుని అప్పటి మూడ్ పాడుచేసుకోవడం అతడికి ఇష్టంలేదు. అప్పుడే వికసించిన  పద్మంలా వున్న సుమని చూస్తూ "ఇప్పుడు ఇంకా బాగున్నావు" అన్నాడు.

"అవును. ఇప్పుడు రెండు పూటలా పాలు తాగుతున్నాను. పళ్ళు కూడా బాగా తింటున్నాను. అక్కడ ఇలాంటివి సాగేవి కావు. ఇలాంటి వాటికి నేనెప్పుడూ బాధపడలేదు.కానీ..

జరిగింది తలచుకుంటే సుమ మనసు సలసలా మరిగింది.

చెల్లెలి పెళ్ళికి పుట్టింటికి వెళ్ళింది. పెళ్ళి ఘనంగా వేడుకలతో జరిగింది. కానీ కూతుర్ని అటు అత్తవారింటికి సాగనంపగానే తండ్రి మంచమెక్కాడు. డాక్టర్ మానసిక వ్యధ అన్నాడు. అసలు కారణం తమ్ముడి ధూం, ధాంలతో అర్థమయింది.

"ఉన్న కాస్త పొలమూ అమ్మేసి దాని పెళ్ళి చేసేశారు. ఇప్పుడు నాకు ఇంజనీరింగ్ కాలేజీలో డొనేషన్ కట్టమంటే డబ్బు లేదంటున్నారు. ఛీ! ఛీ! నేనసలు ఇంట్లో వుండను. ఎట్లైనా పోయి ఏ కూలో చేసుకు బతుకుతాను" అంటూ కల్లు తాగిన కోతిలా గెంతులేస్తున్నాడు తమ్ముడు.

తల్లి కన్నీళ్ళతో పరిస్థితి వివరించింది సుమకి.

పాత కథే.

అన్న ఉద్యోగం చేస్తున్నాడే కానీ,  చెల్లెలి పెళ్ళికి ఏ మాత్రమూ సాయం చెయ్యలేదు. ఉన్న పొలం అమ్మేసి చెల్లెలి పెళ్ళి చేసేస్తే తమ్ముడు బాగా చదువుకుంటున్నాడు కనుక వాడి బతుకు వాడు బతుకుతాడు. తమ బాధ్యతలు తీరిపోతాయి

అనుకున్నారు ఆ వృద్ధ దంపతులు. అయితే ఫస్ట్ క్లాసులో ఇంటర్ పాసయి, ఎప్పుడూ కాలేజ్ ఫస్ట్ వస్తున్న తమ్ముడు ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లో పాసు కాలేకపోయాడు. ఆ చిదంబర రహస్యమేమిటో ఆ భగవంతుడికే తెలియాలి. ఆశాభంగం సహించలేకపోతున్నాడు తమ్ముడు. డొనేషన్ కట్టి అయినా ఇంజనీరింగ్‌లో చేరాలంటున్నాడు. పదమూడువేలు డొనేషన్ కట్టాలట. అదీ అరవై శాతంపైన మార్కులొస్తే.

"మీ ఆడవాళ్ళంతా మీకేదో అన్యాయం జరిగిపోతోందని గోల పెట్టేస్తారు. చూడు. దానికయితే పదివేలు కట్నం గుమ్మరించి మరో పదివేలు ఖర్చుపెట్టి పెళ్ళి చేశారు. నాకు డొనేషన్ కట్టడానికి మాత్రం డబ్బు లేదట."

సుమతో ఫిర్యాదు చేశాడు తమ్ముడు. అటు తెలివి తేటలుండీ చదువుకోవటానికి అవకాశం లేకుండా పోతున్న తమ్ముడినీ, ఇటు తమ్ముడి బెదిరింపులతో మంచమెక్కిన తండ్రినీ, ఏమీ చెయ్యలేక కళ్ళనీళ్ళతో కుములుతున్న తల్లినీ చూసి సహించలేకపోయింది సుమ. తన చంద్రహారం తాకట్టుపెట్టి పదమూడువేలూ తెచ్చి తమ్ముడికి ఇచ్చింది. తమ్ముడి సంబరం ఇంతా అంతా కాదు.

"అక్కా! నువ్వు దేవతవే. నేను ఇంజనీరునయ్యాక నీకు పది వరసలు కాదు ఇరవై వరసల చంద్రహారం చేయిస్తాను. చంద్రహారం ఏం కర్మ? మన గుళ్ళో భవానీదేవికున్నట్లు కాసులపేర్లూ, బంగారం జడ కూడా చేయించేస్తాను.." రాజకీయనాయకులను మించి  వాగ్దానాల వర్షం కురిపించేస్తున్నాడు తమ్ముడు.

అమ్మ మాత్రం తమ్ముడిలా పొంగిపోలేదు సరికదా డిలా పడిపోతూ "ఎంత  పని చేశావే? రేపు అత్తారింటికి వెళ్ళాక మీ ఆయనా, అత్తమామలూ ఊరుకుంటారా? ఏం గొడవలొస్తాయో?" అంది.

ఈ విషయం సుమ గొలుసు అమ్మబోయే ముందే ఆలోచించి తనను అంతగా ప్రేమించే శ్రీవారు ఈ విషయం అర్థం చేసుకోలేడా అనుకుంది.

అందుకే ధైర్యంగా "ఏం ఫరవాలేదమ్మా ఆయన చాలా మంచివారు. నేనంటే ఎంతో ప్రేమ. ఇలా అవసరానికి నా గొలుసు ఆదుకుందంటే ఆనందిస్తారే తప్ప ఏమీ అనరు" అంది.

తల్లి స్థిమితపడి "అదృష్టవంతురాలవమ్మా! అయినా ఎలాగో ఒకలా ఆ గొలుసు విడిపించి నీకు ఇప్పించేస్తాను. ఆడపిల్ల సొమ్ము మాకెందుకు?" అంది ఇంకా నొచ్చుకుంటూనే.

మంచంలో ఉన్న తండ్రికి సంతోషం ఎంత కలిగిందో, ఆవేదనా అంతే కలిగింది. ఆత్మాభిమానం గాయపడింది.

"నాక్కాస్త ఓపిక రాగానే నా పెన్షన్ అమ్మేసి నీ గొలుసు విడిపిస్తానమ్మా! మా మూలంగా నువ్వు మాటపడకూడదు" అన్నాడు.

"ఏం ఫరవాలేదు. ముందు మీరు విశ్రాంతి తీసుకోండి" ధైర్యం చెప్పింది తండ్రికి.

ఆ సమస్య సుమ ఊహించినంత సులువుగా తేలిపోలేదు. గుమ్మంలోకి అడుగుపెడుతుండగానే అత్తగారు అడిగేసింది.

"అదేమిటే? మెడ బోసిగా వుంది. చంద్రహారమేది?" అని.

"పెట్టెలో వుంది."

మాట తప్పించబోయింది. అత్తగారు అనుమానంగా చూసింది. కానీ, అప్పటికి ఊరుకుంది.

ఆ రాత్రి శ్రీహరితో చెప్పింది అసలు విషయం. ఆమె ఆశించినట్లు అతడు "ఫరవాలేదులే అయినవాళ్ళని ఆపదలో ఆదుకోకపోతే ఎలా?" అనలేదు.

ముఖం చిట్లించి "నాకు చెప్పకుండా ఎందుకంత పని చేశావ్?" అన్నాడు కొంత కరుగ్గా.

గతుక్కుమంది సుమ.

"నా గొలుసు. నా యిష్టం" అని లోలోపల అరుచుకుంది. ఆమెలోని ఆధునిక స్త్రీ. విచక్షణ ఆ గొంతుని నొక్కెయ్యగా సాధ్యమయినంత శాంతంగా "మీరు ఏమీ అనరనుకున్నాను. అయినా నాన్నగారు త్వరలో విడిపిస్తానన్నారు" అంది.

"ఆ! ఆయన రిటైరయి కూచున్నారు. విడిపించటానికి డబ్బెక్కడ నుంచి వస్తుందీ?"

విసుగు అతని గొంతులో.

"ఆ సంగతి తెలిసే ఇంత గొడవ చేస్తున్నారా?" సుమ లోలోపలి గొంతు.

"సరేలే! సాధ్యమయినంత తొందరో విడిపించమని రాయి."

ఆమెని దగ్గిరకు తీసుకున్నాడు. పెళ్ళయిన అన్ని రోజులకి మొదటిసారిగా మనసారా అతడికి తనని తాను అర్పించుకోలేకపోయింది. 'ఇదే నా ప్రేమకి అర్థం?' అని ఘోషించింది లోపలి మనసు.

త్వరలోనే అత్తగారికి అసలు విషయం తెలిసిపోయింది. ఇక అక్కడి నుంచీ సాధింపులు తారాస్థాయినందుకున్నాయి. ఈ విషయంలో ఇంట్లో అందరూ ఒకటయ్యారు. నిప్పుల మీద వున్నట్లుగా వుంది సుమకి. చివరికి శ్రీహరి దగ్గర నుంచి కూడా చిన్న ఓదార్పు మాట రావటం లేదు.

"తొందరగా ఆ గొలుసు విడిపించమని మీ నాన్నకి రాయి" అంటున్నాడు అతడు కూడా ఆజ్ఞాపిస్తున్నట్టు. మనసు మండుతున్నా పెదవులు బిగబట్టుకుని క్షోభనంతా భరించింది. తొందరపడి కాపురాలు చెడగొట్టుకోకూడదని ఉగ్గుపాలతో బోధించిన సంస్కారం.

ఏది ఎలా ఉన్నా ఏ ఆచారాలు మారవు. మార్చుకోవాలని ఎవరూ అనుకోరు. అందుకే అనారోగ్యంతో ఉన్నా, తమ్ముడి చదువూ, ఇంటిఖర్చులూ భరించటానికి చాలా కష్టంగా ఉన్నా సుమని పురిటికి తీసుకెళ్ళటానికి తమ్ముడు

వచ్చాడు. ఎలా అయినా ఆ వాతావరణంలోంచి బయటపడాలని ఉంది సుమకి కూడా. ప్రయాణమయింది. పెద్దల అనుమతితో. ఆ రాత్రి శ్రీహరి వదలలేక వదిలాడు సుమని.

సుమ మనసు పొంగిపోయింది.

అంతలోనే ఆ పొంగుపయిన చన్నీళ్ళు జల్లాయి అతని మాటలు.

"ఈసారి వచ్చేటప్పుడు ఆ గొలుసు తప్పకుండా తీసుకురా."

బాబు పుట్టాడు. ఆచారలు, సంప్రదాయాలు మరిచిపోలేని అమ్మ "బారసాల" అంటూ హడావుడి చెయ్యబోయింది. కానీ సుమ తీవ్రంగా అడ్డుపడింది. ఇంటి పరిస్థితి అర్థం చేసుకుని.

"మన బాబుకి 'ప్రభు' అని పేరు పెట్టుకుందాం" అని శ్రీహరికి ఉత్తరం రాసింది.

అతని దగ్గర నుంచి సమాధానం రాలేదు. మనసు గాయపడింది. ప్రభుకి మూడోనెల వచ్చాక మళ్ళీ ఉత్తరం రాసింది – వచ్చి తీసుకెళ్ళమని.

"గొలుసు విడిపించి ఉత్తరం రాయి. వచ్చి తీసుకువెళ్తాను" అని.

ఆ ఉత్తరం ఒకటికి పదిసార్లు చదువుకుంది. భావం లీలగా అర్థమయింది. అయినా స్పష్టంగా తేల్చుకోవాలని మళ్ళీ ఒక ఉత్తరం రాసింది.

"నాన్నగారి ఆరోగ్యం ఏమీ బాగోలేదు. తమ్ముడి చదువుకీ, ఇంటి ఖర్చులకీ నాన్నగారి పెన్షనే ఆధారం. ఈ పరిస్థితుల్లో నాన్నగారు తన పెన్షన్ అమ్మి గొలుసు విడిపించటం నాకు ఇష్టం లేదు. అది అమ్మేద్దామనుకుంటున్నాను" అని.

దానికి శ్రీహరి దగ్గరనుంచి సుమ ఆశించనంత ఖచ్చితమైన సమాధానం వచ్చింది.

"నువ్వు గొలుసు అమ్మడం నాకిష్టంలేదు. ఆ ప్రయత్నం చెయకు. అది విడిపించిన తర్వాతనే నాకు ఉత్తరం రాయి వచ్చి తీసుకెళ్తాను" అని.

స్పష్టంగా తేలిపోయింది. గొలుసుతో వస్తే తప్ప తనకు ఆ ఇంట్లో ప్రవేశం లేదన్నమాట.

ఆలోచనలో పడింది. తను ఒంటరిది కాదు. బాబుకూడా వున్నాడు. చూస్తూ చూస్తూ ముసలితనంలో అనారోగ్యంతో వున్న తండ్రికి ఆ పెన్షన్ డబ్బు కూడా లేకుండా చేసి తన గొలుసు తను తీసుకుపోలేదు. ధైర్యంగా పరిస్థితులు ఎదుర్కోవడానికే నిశ్చయించుకుంది. తల్లికి అసలు పరిస్థితి చెప్పలేదు. చెపితే ఆవిడ కూడా మంచమెక్కుతుంది. లేదా తమ ప్రాణాలు పోయినా సరేనని ఆ గొలుసు విడిపించి తీసుకొస్తుంది.

పెట్టెలో మూల మడత పెట్టి వున్న యం.ఏ డిగ్రీ దుమ్ము దులిపింది. ఎకనమిక్స్ లెక్చరర్ కావాలని కనిపించిన ప్రకటనలకన్నింటికీ దరఖాస్తులు పడేసింది. చివరకు ఒక ట్యుటోరియల్ కాలేజిలో చిన్న ఉద్యోగం దొరికింది. తల్లితో అత్తవారింటికి వెళ్తున్నానని చెప్పి ఉద్యోగం చెయ్యటానికి వచ్చేసింది. మొదట్లో చాలా అవస్థలు పడింది.

ఒక సంవత్సరం కాగానే జూనియర్ కాలేజిలో ఉద్యోగం సంపాదించుకుంది. ఒక వంక పసి పిల్లవాడిని పెంచుతూనే పి.హెచ్.డి చేసింది. డిగ్రీ కాలేజికి మారింది. ప్రభుకి నాలుగేళ్ళు వచ్చాయి. వాడిని ప్రైమరీ స్కూల్లో కిండర్ గార్డెన్‌లో చేర్పించింది. జీవితం ఒక గాడిన పడింది. ఇన్ని సంవత్సరాల్లోనూ సుమ ఏనాడూ శ్రీహరిని మరిచిపోలేదు. అతడి విషయాలు ఎప్పటికప్పుడు కనుక్కుంటూనే వుంది. అతడు మళ్ళీ పెళ్ళికి ప్రయత్నాలు చేస్తున్నాడని తెలుసుకుని ఆ పెళ్ళి కూతుళ్ళకు ఉత్తరాలు రాసింది.

"నా గతి అయింది. ఇక మీ గతి ఏమవుతుందో ఇలా ఆలోచించుకోండి. అదీగాక మీరు ఈ పెళ్ళి చేసుకుంటే అది చెల్లదని నేను కోర్టులో దావా వేస్తాను.." అని.

అక్కడితో ఆ పెళ్ళి కూతుళ్ళు బెదిరి శ్రీహరి సంబంధం వదులుకున్నారు.

అయిదేళ్ళ తర్వాత సుమ, శ్రీహరి ఒకరినొకరు ముఖాముఖి కలుసుకున్నారు. స్నేహితురాలి పెళ్ళికి వెళ్ళింది సుమ. అక్కడికి పెళ్ళికొడుకు తరపున వచ్చాడతను.

అలా చూస్తూ నిలబడిపోయాడు అతడు.

సముద్రాలు పొంగాయి ఆమెలో.

అతడే పలకరించాడు ఆమెని.

"ఎక్కడుంటున్నావు?"

"ఈ ఊళ్ళోనే గాంధీనగర్‌లో"

ఆ తర్వాత ఏం మాట్లాడాలో తెలీలేదు. అతనికి ఎన్నెన్నో మాట్లాడాలని వున్నా గొంతు మూగబోయినట్లు అవుతూంది.

"మా యింటికి రండి" ఆమె ఆహ్వానించింది.

"మా ఇంటికి" అన్నమాట చేదుగా వున్నా ఆహ్వానాన్ని వెంటనే ఒప్పుకున్నాడు.

పొందికగా వున్న చిన్న యిల్లు. ముద్దు మూటలు కట్టే బాబు. ఆనందమూ, ఆవేదనా, చెట్టాపట్టాలేసుకుని అల్లరి చేశాయి అతని మనసులో.

"తల ఎలా వుందో? రెల్లు తుప్పలాగ.. తలంటి పొయ్యనా?" నవ్వుతూ అడిగింది.

లోలోపల తెల్లబోయాడు. ఇన్ని సంవత్సరాలలో ఏమీ జరగనట్లు మాట్లాడుతున్నందుకు.

తల ఊపాడు ఒప్పుకుంటున్నట్లు,

నూనె సీసా చేతి వేళ్ళతో చమురు బుర్ర కంటేలా సుతారంగా మాలిష్ చేసి షాంపూతో తల రుద్ది. తనే వీపు కూడా రుద్దింది.

ఆ హాయిలోంచి మత్తుగా కళ్ళు తెరచి "ఇది వరకు నువ్వెప్పుడూ ఇలా తలంటి పొయ్యలేదు" అన్నాడు.

నవ్వింది.

"ఆ ఇంట్లోనా? అటు తల తిప్పితే మడికట్టుకున్న అత్తగారు. ఇటు చూస్తే జపం చేసుకుంటూ అందరినీ గమనిస్తున్న బామ్మగారు. ఇల్లంతా తిరుగుతూ పురిటి కొచ్చిన వదినగారూ, బిలబిలలాడుతూ ఊపిరాడనియ్యకుండా ఆవిడ పిల్లలు. మనిద్దరం కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చెయ్యాలనే చిన్న సరదా కూడా నాకు తీరని కోరికగానే వుండిపోయిందే. ఇక – తలంటి పొయ్యడం కూడాను."

తెల్లబోయి చూశాడు. ఆడవాళ్ళకి ఇలాంటి సరదాలుంటాయనే ఆలోచన కూడా అతడికి ఇంతకు ముందు రాలేదు. అతడి దృష్టి అంతా పడగ్గది మీద మాత్రమే.

తలంటి దగ్గర మాత్రమేకాదు, మిగిలిన అన్ని విషయాల్లోనూ ఈ సుమ తనకు తెలిసిన సుమ కాదనిపించింది. ఏదో అద్భుత లోకంలోకి వచ్చిపడినట్లు అనిపించింది. ఆ ఇంట్లోంచి కదలాలలనిపించలేదు.

కానీ, ప్రభు చేత తనని "అంకుల్" అని పిలిపించినప్పుడు మాత్రం మత్తు విడిపోయింది.

"అదేమిటి? నేను వాడికి.."

చెప్పబోతుండగానే అడ్డుకుని "ప్లీజ్ ఇప్పుడేమి మాట్లాడకండి. అన్నీ తరువాత" అని ప్రభుని తీసుకుపోయి పడుకోబెట్టి వచ్చింది.

"నేను వాడితో వాళ్ళ నాన్న ఫారెన్‌లో వున్నారని చెప్పాను. చుట్టుప్రక్కల అందరితోనూ అలాగే చెప్పాను. ఆ విషయం అలాగే వుండాలి."

"అదేమిటి? నువ్వు నాతో మన ఇంటికి రావటంలేదా?"

"వస్తున్నానని ఎవరు చెప్పారు?"

"అయితే ఇదంతా ఏమిటి?"

"ఒక ఫ్రెండ్‌గా వచ్చారు. ఫ్రెండ్‌గా వెళ్ళండి. అంతే."

బిత్తరపోయి చూశాడు. సుమ చెప్తున్నది అతడికి కొరుకుడు పడటంలేదు. సుమ తనను ఆహ్వానించినప్పటినుంచీ, ఆమె సాంగత్యంలో అతడి మనసులోని మమత కొత్త చిగుళ్ళు వేయటం ప్రారంభించినప్పునుంచీ చంద్రహారం తీసుకురాని ఆమె అపరాధాన్ని ఉదారంగా క్షమించేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ మాటే గర్వంగా చెప్పాలనుకున్నాడు. కానీ, ఇదేమిటీ?

అతడికి కోపం వచ్చేసింది.

"అంటే? నీకిలాంటి ఫ్రెండ్స్ అప్పుడప్పుడు వస్తూ వుంటారన్నమాట" కసిగా అన్నాడు. ఆమెను బాగా అవమానించాననుకున్నాడు .ఆమెకి రాబోయే కన్నీళ్ళు తుడవడం కోసం రుమాలుకూడా సిద్ధంగా ఉంచుకున్నాడు.

అయితే సుమ ఏడవటానికి బదులుగా ముఖం అటు తిప్పుకుని నవ్వుకుంది.

సాధ్యమయినంత గంభీరంగా అంది.

"ఈ ప్రశ్న అడిగే అధికారం మీకు లేదు. సమాధానం చెప్పవలసిన అవసరం నాకు లేదు."

"అంటే?"

"మీరు రెండో పెళ్ళి చేసుకోవాలని చూశారుగా?"

"కాలేదుగా?"

"అవటం, కాకపోవటం వేరే విషయం. మీ మనసులోకి ఆ ఆలోచన ఎప్పుడయితే వచ్చిందో, అప్పుడే నా మీద అధికారం పోయింది."

గుటక మింగాడు. ఏం మాట్లాడటానికీ నోరు రాలేదు.

అయిదు సంవత్సరాల ఎడబాటు తరవాత నూత్న చైతన్యంతో తనను ఉక్కిరి బిక్కిరి చేసిన సుమ అతడికి కంటిమీద కునుకు రానీయలేదు. అతి ప్రయత్నం మీద సుమ ఉద్యోగం చేస్తున్న ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. అయితే అతడు కలలు కన్నట్లు అతడు ఒక్కడూ రావటానికి కుదరలేదు. అతడితోపాటు అతడి తల్లి, తల్లీ, చెల్లెలు కూడా వచ్చారు అక్కడికీ అతడు సంకోచం వదిలిపెట్టి తల్లితో రావద్దనే అన్నాడు. ఆవిడ ఒప్పుకోలేదు.

"అదేమిటిరా! హోటల్ మెతుకులు తింటే నీ ఆరోగ్యం ఏమయిపోతుందీ?" అని బెంగ పెట్టేసుకుని వచ్చేసింది.

సుమ తనతో యథాప్రకారం కలిసి వుంటే తల్లికి ఎలాగో ఒకలా నచ్చచెప్పొచ్చు అనుకున్నాడు శ్రీహరి.

కానీ అలా రావటానికి సుమ సుతరామూ ఒప్పుకోలేదు.

ఒకటే పాట "మీరు రెండో పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. ఆ క్షణం నుంచే మీకేం కాను" అని.

ఆ రోజు స్నేహితుల అసభ్య ప్రలాపనతో మనసంతా చీదరగా అయిపోయింది శ్రీహరికి.

"సుమా! నీ పట్టుదల నిజంగా అర్థం లేనిది. నా భార్యతో నేను అక్రమ సంబంధం పెట్టుకున్నానని ఎలా చెప్పుకోనూ? సిగ్గుచేటు కాదూ?"

నవ్వింది సుమ.

"మీరు సిగ్గుపడవలసింది ఏముంది? నూటికి డెబ్భై అయిదుమందికి పైగా మొగవాళ్ళందరూ భార్యలతో అక్రమ సంబంధాలు పెట్టుకున్నవాళ్ళే"

తెల్లబోయాడు.

"ఏమిటి, నువ్వనేది?"

"క్రమ సంబంధం అంటే వుండవలసిన విధంగా వుండటం. "అక్రమ సంబంధం" అంటే ఏ విధంగా వుండకూడదో అలా వుండటం. నాకు తెలిసినంతవరకూ భార్యా భర్తల సంబంధాల్లో మూడొంతులు వండవలసిన విధంగా లేవు."

"ఇంతకూ నువ్వు మన ఇంటికి రానంటావు?"

"రాను! 'భార్య' అనే ముద్ర పడగానే ఎక్కడ లేని ఆంక్షలూ పెట్టి అయినదానికీ, కాని దానికీ పెత్తనాలు చెలాయించే ఆ 'క్రమ సంబంధం' కంటె హాయిగా స్నేహితుల్లా కలుసుకునే ఈ 'అక్రమ సంబంధమే' బాగుంది."

సుమ మీద పట్టరాని కోపమొచ్చినా ఏమీ అనలేక లోలోపల సణుక్కున్నాడు శ్రీహరి.

ఇష్టం వచ్చినట్లు తిట్టడానికి ఆమె భార్య కాదు – స్నేహితురాలు.

ఏది ఎలా జరిగినా సుమ నోరుమూసుకు పడివుంటుందనుకోవటానికి ఇది 'క్రమ సంబంధం'కాదు. "అక్రమ సంబంధం."

COMMENTS